సాక్షి సంగారెడ్డి

బుధవారం । 15 । నవంబర్ । 2023



బాబ్బాబ్..!

సార్వత్రిక ఎన్నికల తరుణంలో నామినేషన్ల పర్వం, పరిశీలన సైతం పూర్తయింది.

వివరాలు 10లో ▸



ఓటేస్తా గానీ.. స్వీట్ తినండమ్మ

కాంగ్రెస్ అభ్యర్థి సంజీవరెడ్డి సతీమణి అనుపమరెడ్డి నారాయణఖేడ్‌లో ప్రచారం నిర్వహించారు.

వివరాలు 10లో ▸



బీఆర్ఎస్, బీజేపీ హామీలను నమ్మొద్దు

బీఆర్ఎస్, బీజేపీ హామీలు నమ్మొద్దని కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ అన్నారు.

వివరాలు 11లో ▸

చాచాకో సలాం



నారాయణఖేడ్: సాంస్కృతిక కార్యక్రమంలో నృత్యం చేస్తున్న చిన్నారులు



రాయికోడ్: నివాళులర్పిస్తున్న విద్యార్థులు

బాలల దినోత్సవం సందర్భంగా మంగళవారం మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి చిన్నారులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. నారాయణఖేడ్, రాయికోడ్‌లోని పలు పాఠశాలల్లో దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. ఆయా కార్యక్రమాల్లో కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. నారాయణఖేడ్/రాయికోడ్(అందోల్)



చిన్నారులతో పట్నం రవితేజ

సంగారెడ్డిలో ఉన్న పీఎంకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో 32 మంది అనాథలకు నూతన వస్త్రాలను పట్నం రవితేజ అందజేశారు. చిన్నారులతో కేక్ కటింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఓపెన్ షెల్టర్ ఫర్ బాయ్స్ ఆశ్రమంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. - సంగారెడ్డి

న్యూస్‌రీల్

మూడు నామినేషన్ల ఉపసంహరణ

పటాన్‌చెరు టౌన్: అసెంబ్లీ స్థానానికి 25 మంది నామినేషన్లు దాఖలు కాగా మంగళవారం అందులో ముగ్గురు ఉపసంహరించుకున్నారు. స్వతంత్ర అభ్యర్థి నల్లగండ్ల లింగారెడ్డి, తెలంగాణ ప్రజాశక్తి పార్టీ అభ్యర్థి కొత్త బలిజ బసవరాజ్, భారతీయ స్వదేశీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ కుమార్ గౌడ్ ఉపసంహరించుకున్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా తెలిపారు. సోమవారం స్క్రూటినీ నిర్వహించగా 25 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదించడం తెలిసిందే.

రేపు హద్నూర్‌కు మంత్రి హరీశ్‌రావు రాక



సభా స్థలిని పరిశీలిస్తున్న దేవిప్రసాద్, శివకుమార్ తదితరులు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఈనెల 16న ఆర్థిక శాఖ మంత్రి తన్నీర్ హరీశ్‌రావు మండలపరిధిలోని హద్నూర్‌కు రానున్నారు. పాత పోలీస్ స్టేషన్ సమీపంలో జరిగే ఎన్నికల ప్రచార సభలో పాల్గొననున్నారు. మంగళవారం ఎన్నికల ఇన్‌చార్జి, బెవరైజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవి ప్రసాద్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఈదుపల్లి శివకుమార్ తదితరులు సభా స్థలిని పరిశీలించారు. మొదటిసారి మండలానికి వస్తున్నందునా కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించాలని బీఆర్ఎస్ నేతలకు సూచించారు. గత నెల 30న న్యాల్కల్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమానికి హరీశ్‌రావు హాజరుకావాల్సి ఉండగా ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి ఘటన నేపథ్యంలో రాలేకపోయారు.

పెళ్లి విషయమై మనస్తాపంతో యువతి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: పెళ్లి విషయంలో మనస్తాపం చెందిన యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన అమీన్‌పూర్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్ర ఉస్మానాబాద్ జిల్లాకు చెందిన మీనాక్షి కుంజల్(22) అమీన్‌పూర్ మండలం బీరంగూడలో ఉన్న బంధువుల వద్ద ఉంటోంది. కంప్యూటర్ కోర్సు నేర్చుకుంటోంది. ఈ క్రమంలో యువకుడితో పరిచయమై అదికాస్త ప్రేమగా మారింది. రెండు నెలల క్రితం అతడిని పెళ్లి చేసుకుంటానని ఇంట్లో చెప్పింది. తల్లిదండ్రుల నుంచి సోకిన హెచ్ఐవీ ఉండటంతో వద్దని నచ్చజెప్పారు. దీంతో మనస్తాపం చెందిన తాను ఈనెల 13వ తేదీ రాత్రి ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే కుంజల్ మృతిచెందినట్లు నిర్ధారించారు. సోదరుడు అవినాశ్ మంగళవారం ఫిర్యాదు చేయగా కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రం పరిశీలన



స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

పటాన్‌చెరు టౌన్: మండలంలోని రుద్రారం గీతం వర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాన్ని మంగళవారం సాయంత్రం కలెక్టర్ శరత్, ఎస్పీ రూపేశ్, ఎన్నికల సాధారణ పరిశీలకులు దీపక్ సింగ్లా, పవన్ కుమార్ పరిశీలించారు. వారి వెంట వ్యయ పరిశీలకులు నాజీమ్ జై ఖాన్, పోలీస్ అబ్జర్వర్ దయాల్ గంగ్వార్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

గణేశ్‌గడ్డ ఆలయంలో విశేష పూజలు



ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

పటాన్‌చెరు టౌన్: మండలపరిధిలో ఉన్న రుద్రారం గణేశ్‌గడ్డ ఆలయంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా అభిషేకాలను సైతం అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్ స్వామి, చంద్రశేఖర్ నిర్వహించారు. భక్తులు క్యూలైన్‌లో వెళ్లి స్వామిని దర్శించుకునేలా ఏర్పాటు చేశారు. నిత్యాన్నదానాన్ని నిర్వహించారు.

యువత చేతిలో భవిత

ఉమ్మడి జిల్లాలో వారిదే మెజార్టీ

- వర్తమాన పరిస్థితులపై పూర్తి అవగాహన
- పార్టీల ఫోకస్

ఉమ్మడి మెదక్ జిల్లాలో యువ ఓటర్లు క్రియాశీలక పాత్ర పోషించనున్నారు. మెజార్టీ ఓటర్లుగా ఉండటంతో వీరు తీసుకునే నిర్ణయంపైనే అభ్యర్థుల భవిత ఆధారపడి ఉంది. ఐదేళ్లకోసారి వచ్చే అద్భుత అవకాశం ఇప్పుడు యువత చేతిలో ఉంది. సంక్షేమం, అభివృద్ధి ఆకాంక్షించే నాయకులను ఎన్నుకుంటారని భావించవచ్చు.





నారాయణఖేడ్: దేశ భవిష్యత్ నిర్ణయించడంలో నేటి యువతది కీలక పాత్ర. వారు రాజకీయంలో కీలక పాత్ర పోషిస్తారనడంతో ఎటువంటి సందేహమూ లేదు. ఇప్పుడున్న వారిలో వంద శాతం అక్షరాస్యులే. కాగా ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్న మెజార్టీ ఓటర్లుగా యువత ఉంది. వీరు ఎన్నికల్లో అభ్యర్థుల భవితవ్యం తేల్చగలరు. సంగారెడ్డి జిల్లాలో 18- 19 ఏళ్ల వయసు గల ఓటర్లు 50, 684 మంది ఉండగా, 20- 29 ఏళ్ల వయసు 3,11,433, 30-39 ఏళ్ల వారు 4,36,764, 40-49 ఏళ్ల వారు 2,72,554 మంది ఉన్నారు. మెదక్ జిల్లాలో 18-19 వయసు ఉన్న వారు 17,061, 20-29 ఏళ్ల వారు 97,390, 30-39 ఏళ్ల వారు 1,15,164, 40-49 ఏళ్ల వారు 94,638 మంది ఉన్నారు. సిద్దిపేట జిల్లాలో 18-19 ఏళ్ల వారు 28,535, 20-29 ఏళ్ల మధ్య 2,00,676, 30-39 ఏళ్ల వారు 2,60,200, 40-49 ఏళ్ల వారు 1,82,977 మంది ఉన్నారు.

జిల్లా	మొత్తం ఓటర్లు
సంగారెడ్డి	9,96,474
సిద్దిపేట	9,48,669
మెదక్	4,40,341

యువతపై నేతల దృష్టి..

యువ ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటం, వారు ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశాలు ఉండటంతో రాజకీయ నాయకులు సైతం వారిపై దృష్టి సారిస్తున్నారు. ఎలాగోలా తమకు మద్దతుగా ఉండేలా ఓటు వేసేలా వారిని చైతన్య పర్చాలని ఉవ్విళ్లూరుతున్నారు. తాము గెలిస్తే వారి కోసం చేపట్టబోయే పనుల గురించి వివరిస్తూ గెలుపే లక్ష్యంగా వారిని ఆకర్షించేందుకు యత్నిస్తున్నారు.

ప్రలోభాలకు లొంగే అవకాశం తక్కువే..

ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు రాజకీయ నాయకులు రకరకాల వస్తువులు కానుకలుగా ఇస్తుంటారు. సామాన్యుల్లో కొందరు వారి పరిస్థితుల దృష్ట్యా రాజకీయ నాయకులు ఇచ్చిన వాటికి కట్టుబడి ఓటు వేసే అవకాశం ఉంది. కానీ యువత అలా కాదు. ఎవరు మంచి చేస్తారో వారికే మద్దతు ఇచ్చే అవకాశం ఉంటుంది. చదువుతున్న యువతతో పాటు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారు ఇంటికొకరు ఉంటారు. దీంతో ప్రతి కుటుంబంలో వర్తమాన రాజకీయాలు చర్చిస్తూ, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తుంటారు. వారి ఓటుతోపాటు తమ కుటుంబసభ్యుల ఓట్లు కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. ఈ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు, ఓటముల్లో యువత పాత్ర కీలకం కానుంది.

సందేహాలు నివృత్తి చేసుకోవాలి

- ఎన్నికలపై నేతలు పూర్తి అవగాహనతో ఉండాలి
- జిల్లా జనరల్ అబ్జర్వర్ పవన్ కుమార్



మాట్లాడుతున్న పవన్ కుమార్, శరత్

సంగారెడ్డి టౌన్: జిల్లాలో శాసనసభ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా జనరల్ అబ్జర్వర్ పవన్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎన్నికల జనరల్ అబ్జర్వర్లు, ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లు, పోలీస్ అబ్జర్వర్, కలెక్టర్‌తో కలిసి ఆయన పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవాలని, పూర్తి అవగాహనతో నడుచుకోవాలని పొలిటికల్ పార్టీల ప్రతినిధులను కోరారు. జిల్లా ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ దయాళ్ గంగ్వార్ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఏ విధంగా ఈ నిర్వహణ జరుగుతుందన్న విషయాన్ని పరిశీలించడానికి వచ్చామని చెప్పారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు కేపీ జయకర్ మాట్లాడుతూ, అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి పైసా అభ్యర్థి వ్యయ రిజిస్టర్లో చూపాలని, షాడో రిజిస్టర్‌తో వెరిఫై చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పొలిటికల్ పార్టీల ప్రతినిధులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అంతకుముందు జిల్లా ఎన్నికల అధికారి శరత్ మాట్లాడుతూ, జిల్లాలో పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశాలు, ఎన్నికల నియమావళి, ఎన్నికల ఖర్చుల నియంత్రణ పర్యవేక్షణ, సి-విజిల్, సువిధ యాప్, అభ్యర్థులు ఏమి చేయొచ్చు, ఏమి చేయకూడదన్న విషయాలపై పూర్తి అవగాహన కల్పించామని అబ్జర్వర్లకు వివరించారు. సమావేశంలో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు దీపక్ సింగ్లా, పవన్ కుమార్, వ్యయ పరిశీలకులు నాజీం జై ఖాన్, కే విజయ్ కృష్ణ వేలాన్, పోలీస్ అబ్జర్వర్ దయాల్ గంగ్వార్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్ఓ నగేశ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఐదు నియోజకవర్గాలకు ఎన్నికల సిబ్బంది

ఎన్నికల నేపథ్యంలో ఈనెల 30వ తేదీన జరిగే పోలింగ్‌కు సంబంధించి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో అవసరమైన పోలింగ్ అధికారులు, సిబ్బంది కేటాయింపు పూర్తయిందని శరత్ తెలిపారు. రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను మంగళవారం ఎన్నికల పరిశీలకుల సమక్షంలో పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. యూత్ మేనేజ్మెంట్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుతోపాటు మోడల్ పోలింగ్ కేంద్రాలు సైతం ఏర్పాటు చేస్తున్నట్లు అబ్జర్వర్లకు వివరించారు.

26 వేల ఎంటీల ధాన్యం కొన్నాం

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డాక్టర్ శరత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో వ్యవసాయ, అనుబంధ శాఖలు, రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. రైస్ మిల్లర్లు నిర్ణీత గడువులోగా సీఎంఆర్ (కస్టం మిల్లింగ్ రైస్) డెలివరీ పూర్తి చేయాలని మిల్లర్లను ఆదేశించారు. ఇప్పటివరకు 26 వేల మెట్రిక్ టన్నుల(ఎంటీ) ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

ఖైదీల సంస్కరణకే 'సంకల్ప'

జైళ్ల శాఖ ఐజీ మురళీబాబు



ఖైదీకి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న మురళీబాబు

సంగారెడ్డి టౌన్: వృత్తి నైపుణ్యంతో ఖైదీలు ఉపాధి పొందవచ్చని జైళ్ల శాఖ ఐజీ మురళీబాబు అన్నారు. సంగారెడ్డి కంది జైలులో నెలరోజులుగా జరుగుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ముగింపు రోజైన మంగళవారం ఖైదీలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రిమాండ్ ముద్దాయిల సంస్కరణ కోసం.. వారు వృత్తి నైపుణ్యం, ఉద్యోగం సాధించే దిశగా జైళ్ల శాఖ పలు విభాగాల్లో శిక్షణ ఇస్తోందన్నారు. విడుదలైన వారు నేరాల బాట పట్టకుండా, మంచి మార్గంలో నిపుణులుగా స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ తరహా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంకల్ప ప్రోగ్రాంలో భాగంగా జిల్లా స్కిల్ కమిటీ ఆధ్వర్యంలో 30 రిమాండ్, అండర్ ట్రయిల్ ఖైదీలకు ఎలక్ట్రీషియన్, హౌస్ వైరింగ్‌లపై శిక్షణ ఇచ్చామన్నారు. అందుకు సహకరించిన న్యాక్‌కు, నాబార్డును అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ భరత్‌రెడ్డి, న్యాక్ డైరెక్టర్ సత్యపాల్ రెడ్డి, నాబార్డ్ ఏజీఎం సెసిల్, మేనేజర్ కృష్ణతేజ, జిల్లా ఉపాధి కల్పన అధికారి వందన, సీడ్ ఎన్‌జీఓ ప్రతినిధులు, సిబ్బంది ఖైదీలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మనోవికాసం

వర్గల్(గజ్వేల్): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, జ్ఞాన వికాసం కోసం విద్యార్థిలోకం పుస్తక పఠనం అలవరచుకోవాలని జ్యోతిబాఫూలే బీసీ గురుకుల సొసైటీ రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి తిరుపతి అన్నారు. మంగళవారం వర్గల్ ఫూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలను రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మద్దిలేటితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక గ్రంథాలు, పుస్తకాలు, రెఫరెన్స్ బుక్స్ తదితర పుస్తకాలతో కొలువైన గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుస్తక పఠనం మనోవికాసానికి దోహదపడుతోందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో హైదరాబాద్, మెదక్ ఆర్సీఓలు ఆదిత్యవర్మ, ప్రభాకర్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు, వీపీ గోవిందరావు, ఏటీపీ కే. భాగ్యలక్ష్మి, డీడబ్ల్యూజీ. భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి పావని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సెక్రటరీ తిరుపతి

పత్తి కొనుగోళ్లకు సిద్ధం

- నేటి నుంచే ప్రారంభం
- 19 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- 2.51లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారుల అంచనా



ఆత్మకూర్ రోడ్డులో ఉన్న జిన్నింగ్ మిల్లు (ఫైల్)

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పత్తి రైతులకు శుభవార్త. పంట చేతికొస్తున్న సమయాన ప్రభుత్వం కొనుగోళ్లకు శ్రీకారం చుట్టింది. బుధవారం నుంచి దశలవారీగా జిల్లాలో పత్తి కొనుగోలు చేసేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు సిద్ధమయ్యారు. జిల్లాలో ఈ ఏడాది 3.58 లక్షల ఎకరాల్లో పంట సాగైంది. 2.51లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా. ఈ విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా గత నెలలో అదనపు కలెక్టర్ మాధురి అధ్యక్షతన జిల్లా స్థాయిలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో 19 జిన్నింగ్ మిల్లులుండగా ఇందులోనే కేంద్రాలను ఏర్పాటు చేసి పంట కొనేందుకు ఏర్పాట్లు చేశారు.

37 గోదాంల ఏర్పాటు

జిల్లాలో పత్తిని నిల్వ చేసేందుకు 37 గోదాంలను అందుబాటులో ఉంచారు. కొనుగోళ్ల కోసం 19 జిన్నింగ్ మిల్లులను గుర్తించారు. జోగిపేట మార్కెట్ పరిధిలో రెండు, వట్‌పల్లిలో ఒకటి, రాయికోడ్‌లో ఐదు, సదాశివపేటలో మూడు, నారాయణఖేడ్‌లో ఎనిమిది కేంద్రాల్లో కొనుగోళ్లు జరిగేలా ఏర్పాట్లు చేశారు. బయోమెట్రిక్ డేటా బేస్ తోనే సీసీఐ కొనుగోళ్లు చేయనుంది. పట్టా పాస్‌బుక్‌తో ఆధార్ లింకు ఉన్న రైతుల నుంచే కొనేలా అధికారులు కసరత్తులు చేస్తున్నారు.

క్వింటాలుకు రూ.7,020లు

పత్తి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.7,020 చొప్పున ప్రభుత్వం నిర్ణయించింది. 8 నుంచి 12 శాతం లోపు ఉన్న తేమ కలిగిన పంటను మాత్రమే కొంటారు. 9 శాతానికి రూ.6,955లు, 10 శాతానికి రూ.6,890లు, 11 శాతం ఉంటే రూ.6,825లు, 12 శాతానికి రూ.6,760లను చెల్లిస్తారు. రియాజ్, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి మాట్లాడుతూ, సీసీఐ ద్వారా పత్తి కొంటున్నామన్నారు. తేమ శాతం తక్కువగా ఉండేలా జాగ్రత్తలు పాటించాలని రైతులకు సూచించారు.

నేడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రాయికోడ్(అందోల్): రాయికోడ్, మునిపల్లిల్లోని పలు జిన్నింగ్ మిల్లుల్లో బుధవారం నుంచి సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నారు. రాయికోడ్ మండలం నాగ్వార్ శివారులోని కేతకీ సంగమేశ్వర, తిరుపతి మిల్లుల్లో, మునిపల్లి మండలం మేళసంగం శివారులోని రామేశ్వరం, మంగళమూర్తి, శ్రీకల్క మిల్లుల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని రాయికోడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చేవెళ్ల విజయలక్ష్మి ధ్రువీకరించారు. క్వింటాలు పత్తికి మద్దతు ధర రూ.7,020గా నిర్ణయించినట్లు ఆమె తెలిపారు.

నిధులు కేంద్రానివి.. సోకు కేసీఆర్‌ది

- అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న సీఎం
- జాతీయ రహదారి విస్తరణకు కేంద్రం నిధులే..
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



మాట్లాడుతున్న బండి సంజయ్

హుస్నాబాద్: నిధులు కేంద్రానివి.. సోకు కేసీఆర్‌దిలా మారిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. మంగళవారం ఆయన బీజేపీ అభ్యర్థి శ్రీరాంచక్రవర్తితో కలిసి హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ఇటీవల హుస్నాబాద్‌కు వచ్చిన సీఎం కేసీఆర్ ఎల్కతుర్తి నుంచి సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణ పనులకు త్వరలోనే నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారని, ఈ పనులకు కేంద్రం ఎప్పుడో రూ.578 కోట్లు మంజూరు చేసిందని, పనులు కూడా శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. కేసీఆర్ కావాలనే అబద్ధపు మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. హుస్నాబాద్‌లో సీసీ రోడ్లతో పాటు పేదలకు రేషన్ బియ్యం, వీధి దీపాలు సహా ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి నిధులన్నీ కేంద్రానివే అని తెలిపారు. ఎంపీగా తాను కేంద్రంతో మాట్లాడి నిధులు తీసుకొస్తే ఆయన కొబ్బరి కాయలు కొట్టి నాటకమాడుతున్నారన్నారు. ఉచిత రేషన్ బియ్యం, సడక్ యోజన కింద రహదారులు, జాతీయ రహదారులు, శ్మశాన వాటికలు, రైతు వేదికలు, కమ్యూనిటీ భవనాలు, ట్రాక్టర్లు ఇచ్చే నిధులు కూడా కేంద్రానివేనని బండి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 2.40లక్షలు ఇళ్లు ఇచ్చిందని, ఆ ఇళ్లు ఏమయ్యాయని అన్నారు. నిరుద్యోగులకు ఒక్కరికి కూడా ఉద్యోగం రాలేదని, కేసీఆర్ ఇంట్లో ఐదుగురికి ఉద్యోగాలు వచ్చాయని ఆరోపించారు. నిరుద్యోగులు కష్టపడి చదివి కోచింగ్ తీసుకొని ఏళ్ల తరబడి ఉద్యోగాలు లేక అల్లాడుతుంటే వారి పక్షాన నిలిచి పోరాడతన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయికి విద్యార్థిని ఎంపిక


విద్యార్థిని అంకిత

హత్నూర (సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూరాలోని కేజీబీవీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని అంకిత డప్పు కళాకారునిగా రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలోని వెలుగు కార్యాలయంలో నిర్వహించిన కళా ప్రదర్శనలో అంకిత జిల్లా స్థాయిలో మొదటి స్థానం దక్కించుకొని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు విజయలక్ష్మి తెలిపారు.

సీఎం సభాస్థలిని పరిశీలించిన సీపీ


సభా స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ శ్వేత

చేర్యాల(సిద్దిపేట): ఈ నెల 18న పట్టణ కేంద్రంలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వెనుక గల సభాస్థలం, పార్కింగ్ ప్రదేశాలను మంగళవారం సీపీ శ్వేత పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రఘుపతిరెడ్డి, స్థానిక ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, ఎస్బీ ఎస్‌ఐ బాలకృష్ణ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల చోరీ


అల్వాల చెప్యాల క్రాస్ రోడ్డులోని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ బాలుర పాఠశాల/కళాశాల

మిరుదొడ్డి(దుబ్బాక): నేరాలు, దొంగతనాల యంత్రణ కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ. 3.50 లక్షల విలువ చేసే సీసీ కెమెరాలను చోరీ చేశారు. ఈ సంఘటన మండల పరిధిలోని అల్వాల, చెప్యాల క్రాస్ రోడ్డులో ఉన్న టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాల/జూనియర్ కళాశాలలో జరిగింది. పాఠశాల ఉపాధ్యాయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాఠశాల/కళాశాలలో దొంగతనాల నియంత్రణ కోసం 16 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కాగా సోమవారం రాత్రి దొంగలు పాఠశాల ఆవరణలోకి చొరబడి ప్రధాన సీసీ ఫుటేజీ కేబుల్‌ను కట్ చేశారు. దీంతో పాఠశాలతో పాటు హాస్టల్‌లో ఉన్న సీసీ కెమెరాలు పనిచేయడం ఆగిపోయాయి. దొంగలు 15 సీసీ కెమెరాలను ఎత్తుకెళ్లారు. కాగా ప్రిన్సిపాల్ ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

పేదల సంక్షేమమే ధ్యేయం


తున్కిబొల్లారంలో మాట్లాడుతున్న అంజిరెడ్డి

ములుగు(గజ్వేల్): ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగుతోందని బీఆర్‌ఎస్ మండల పార్టీ ఇన్‌చార్జి రవీందర్ రావు, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి అన్నారు. మండలంలోని తున్కిబొల్లారంలో గజ్వేల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, సీఎం కేసీఆర్ తరపున మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జయమ్మ అర్జున్‌గౌడ్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ సలీం, ఎంపీపీ లావణ్యఅంజన్‌గౌడ్, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్‌పాష, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బాబుగౌడ్, ఉపాధ్యక్షులు జగదీశ్వర్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, అయిలయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాబ్బాబ్..!

జంగ్ తెలంగాణ

నియోజకవర్గం	అభ్యర్థులు
సంగారెడ్డి	30
జహీరాబాద్	28
పటాన్‌చెరు	25
ఆందోల్	21
నారాయణఖేడ్	20

నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల వివరాలు

- బుజ్జగింపుల పర్వం షురూ
- స్వతంత్రులు, చిన్న పార్టీల అభ్యర్థుల ఉపసంహరణకు యత్నాలు
- నేడు 3గంటల్లోపే గడువు

నారాయణఖేడ్: సార్వత్రిక ఎన్నికల తరుణంలో నామినేషన్ల పర్వం, పరిశీలన (స్క్రూట్నీ) సైతం పూర్తయింది. ఇక తుది జాబితాలో ఎవరెవరు ఉంటారనే దానిపై ఆసక్తి నెలకొంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరనేది తేలిపోయింది. టికెట్లు దక్కక కొందరు నామినేషన్ వేయగా, ఇతరత్రా కారణాలతోనూ ప్రధాన పార్టీల నాయకులు పోటీగా మరొకొందరు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల విత్‌డ్రాకు 15వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు మాత్రమే అవకాశం ఉంది. ఇక పోటీలో ఉన్న వారికి గుర్తుల కేటాయింపు జరుగుతుంది. అన్ని నియోజకవర్గాల్లోనూ 20మందికి పైగానే నామినేషన్లు వేశారు. 17 మందికంటే ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేస్తే మరో బ్యాలెట్ యూనిట్ పెట్టాల్సి వస్తుంది. ఇలా రెండు బ్యాలెట్ యూనిట్లు ఉంటే ఓటర్లు తికమక పడే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో ఎక్కడ తమకు నష్టం వాటిల్లుతుందోనని ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేసే ప్రధాన పార్టీల అభ్యర్థులు బుజ్జగింపుల పర్వానికి తెరతీశారు. నామినేషన్లు వేసిన స్వతంత్రులకు ఓట్లు పడితే తమ విజయంపై ప్రభావం చూపుతుందని భావించి వారిని పోటీ నుంచి తప్పుకొమ్మని కోరుతున్నారు. దీంతో పాటు తమ పార్టీలో అసంతృప్తులుగా ఉన్న వారెవరైనా వారి వెనుకున్నారా అని ఆరా తీస్తూ అటు అభ్యర్థులను, ఇటు అసంతృప్తులను బుజ్జగిస్తున్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ హోరాహోరీ పోటీ కన్పిస్తుండటంతో స్వతంత్రులతోపాటు చిన్న పార్టీల తరపున బరిలో ఉన్న వారిలో సత్తా ఉన్నవారు నామినేషన్ ఉపసంహరింపజేసేలా ఎక్కడికక్కడే రహస్యంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొందరిని నయాన్నో, భయాన్నో విత్‌డ్రా చేయించాలని, లేదా మచ్చిక చేసుకొని విత్‌డ్రా చేయించాలన్న సంకల్పంతో నాయకులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. గతంలో కొందరు స్వతంత్రులు భారీగానే ఓట్లను కొల్లగొట్టారు. వారివల్ల ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు, ఓటములపై ప్రభావం చూపిందనే చర్చ సాగింది. స్వతంత్రులు పొందే గుర్తుల వల్ల కూడా ఎక్కడ తమకు పడాల్సిన ఓట్లు పోతాయోనన్న భయమూ ఆయా పార్టీ అభ్యర్థుల్లో నెలకొంది. నామినేషన్ వేసిన వారిని విత్‌డ్రా చేయించి మచ్చిక చేసుకొని తమ వెంట ప్రచారం చేయించాలన్న ఆలోచన కొందరు నాయకులు చేస్తున్నారు. కాగా ఈ యత్నాల్లో నాయకులు ఏమేరకు సఫలీకృతం కాగలరో వేచి చూడాల్సిందే.



ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి

అడిషనల్ డీసీపీ ఎస్.మల్లారెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా జిల్లా చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీలు చేయాలని, అదేవిధంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అడిషనల్ డిసిపి ఎస్. మల్లారెడ్డి ఆదేశించారు. అక్కన్నపేట మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మొత్తం 12 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. నగదు, మద్యం, మాదకద్రవ్యాలు తదితర వాటి రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతీ చెక్‌పోస్ట్ వద్ద పోలీసు సిబ్బంది 24గంటలు అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు.

స్వేచ్ఛగా ఓటు వేయాలి

తొగుట సీఐ కమలాకర్

తొగుట(దుబ్బాక): రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రజలు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సీఐ కమలాకర్ సూచించారు. మండలంలోని ఎల్లారెడ్డిపేటలో మంగళవారం సాయంత్రం కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ఓటువేసి నచ్చిన నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమన్నారు. ఓటు విషయంలో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీస్ కంట్రోల్ రూం మొబైల్ నంబర్ 8712667100 లేదా 100కు కాల్ చేయాలని సూచించారు. డబ్బులు, మద్యానికి ఓటును అమ్ముకోవద్దని, మీకు నచ్చిన అభ్యర్థికి నిర్భయంగా ఓటు వేయాలని కోరారు. గ్రామాల్లో వివిధ పార్టీలు నిర్వహించే ప్రచారాన్ని అడ్డుకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో పారా మిలటరీ దళాలతో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.కార్యక్రమంలో ఎస్‌ఐ లింగం, సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిపేటలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న జవాన్లు, పోలీసులు

ప్రతిపక్షాలను తుక్కుగా ఓడించాలి



చేర్యాల(సిద్దిపేట): బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా మండల పరిధిలోని పెద్దరాజుపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఉల్లెంగుల ఏకానందం గ్రామంలో పాత సామాన్లను కొనుగోలు చేసే వారిని కలిసి బండిపై తూకం వేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి.. ప్రతిపక్ష నాయకులను తుక్కుగా ఓడించాలని కోరారు.

గ్యారంటీగా మద్దతు ఇస్తాం...



మద్దూరు(హుస్నాబాద్): జనగామ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తరపున ఆయన కుమారుడు రాకేష్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. మండలంలోని రేబర్తి గ్రామంలో జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఆరు గ్యారంటీలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. స్థానికుడైన ప్రతాప్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శివయ్యగౌడ్, సుదర్శన్‌రెడ్డి, పూల్లూరి రాజు, ఇర్రి రాజు పాల్గొన్నారు.

కారు.. ప్రచారంలో రోజుకో తీరు..



ఓటర్లను ఆకర్షించడానికి బీఆర్‌ఎస్ నాయకులు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. రోజుకో తీరుగా ప్రచారం చేస్తూ ఓటర్లను ఆశ్చర్యానికి గురిచేస్తున్నారు. మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు టెడ్డిబేర్ బొమ్మ వేషధారణలో ఉన్న వ్యక్తితో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. సిద్దిపేట అభ్యర్థి మంత్రి హరీశ్‌రావుకు మద్దతు పలకాలని, కారు గుర్తుకు వేయాలని విజ్ఞప్తి చేశారు. – సిద్దిపేటజోన్

చికెన్ కొట్టు.. ఓటు పట్టు



ఎన్నికల వేడి గ్రామాలలో జోరందుకున్నాయి. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి నాయకులు వినూత్నంగా ప్రచారం కొనసాగిస్తున్నారు.మంగళవారం మనోహరాబాద్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఓ చికెన్ షాపులో కత్తితో మాంసం కొడుతూ ఓటర్లను ఆకట్టుకున్నారు. అదేవిధంగా కాళ్ళకల్‌లో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు ఎలక్షన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ముప్పిరెడ్డిపల్లిలో పెంటన్న ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. –మనోహరాబాద్(తూప్రాన్)

ఓటేస్తా గానీ.. స్వీట్ తినండమ్మ..



పట్టణంలో మంగళవారం కాంగ్రెస్ అభ్యర్థి పట్లోళ్ల సంజీవరెడ్డి సతీమణి అనుపమ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సురేశ్ షెట్కార్ కూతురు గిరిజా షెట్కార్‌లు మహిళలతో కలిసి ప్రచారం నిర్వహించారు. పలు దుకాణాలు, ఇళ్లకు వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని అభ్యర్థించారు. ఓ దుకాణ యజమాని ప్రచారానికి వచ్చిన మహిళలకు స్వీట్లు అందించారు. –నారాయణఖేడ్

అభివృద్ధే బీఆర్‌ఎస్ మార్క్

- కాంగ్రెస్, బీజేపీలతో నష్టపోతాం
- గులాబీ జెండా ఎగరేస్తాం
- బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అభివృద్ధి, సంక్షేమమే బీఆర్‌ఎస్ మార్క్ అని సంగారెడ్డి నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. సదాశివపేట మండల పరిధిలోని ఎన్కేపల్లి, ఇశ్రితాబాద్, వెంకటాపూర్, మాచిరెడ్డిపల్లి, తిమ్మనగూడెం, వెల్టూర్, ముభాకర్‌పూర్(ఏ) తదితర గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్‌కు మహిళలు మంగళ హారతులు, పూలవర్షం, గజమాలలతో ఘన స్వాగతం పలికి ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో ఓడినా ప్రజాక్షేత్రంలో ఉండి సేవ చేశానని తెలిపారు. కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంట్, నీళ్ల సమస్య వస్తుందన్నారు. సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి వ్యతిరేకులను తరిమికొట్టే సమయం ఆసన్నమైందన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంజన్న, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


వెంకటాపూర్‌లో చింతా ప్రభాకర్‌కు మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని తెర్పోల్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు తీరుకు ఆకర్షితులై యువత బీఆర్‌ఎస్‌లో చేరుతోందన్నారు. ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ సమక్షంలో పార్టీలో చేరుతున్న యువకులు


వెంకటాపూర్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్

సీసీఐ కేంద్రాల్లోనే గిట్టుబాటు ధర

హుస్నాబాద్: పత్తిని దళారులకు అమ్మి మోసపోకుండా సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించి రైతులు ప్రభుత్వ గిట్టుబాట ధర పొందాలని వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి సుజన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి విక్రయించాలనుకునే రైతులు కేంద్రాలకు ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. ఆర్‌కె కాటన్ మిల్లు (పోతారం ఎస్), గోమాతా కాటన్ మిల్లు (హుస్నాబాద్), బాలాజీ కాటన్ మిల్లు (పందిల్ల), ఎస్‌ఆర్ఆర్ కాటన్ మిల్లు (పందిల్ల), మహాలక్ష్మి కాటన్ మిల్లు (జిల్లెల్లగడ్డ) సీసీఐ కేంద్రాల్లో మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7200 లభిస్తుందన్నారు. తేమ శాతం 8 నుంచి 12 శాతం ఉన్న పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తారని తెలిపారు.

హైస్కూల్లో గ్రంథాలయం ప్రారంభం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలోని హైస్కూల్లో మంగళవారం డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి బాల చెలిమి గ్రంథాలయం, సైన్సు ల్యాబ్‌లను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆలోచనా విధానం, జ్ఞానం పెంపొందించుకునేందుకు దోహదపడుతాయన్నారు. పుస్తకాలు చదవడం, రాయడం ఎంతో లాభదాయకమని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం సత్తయ్య, ఖైజర్, అశోక్, మనోజ్ పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ

జగదేవ్‌పూర్ (గజ్వేల్): బాలల దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని చిన్నకిష్టాపూర్ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. ఉపాధ్యాయురాలు సుధారాణి తన కూతురును ఇదే పాఠశాలలో చేర్పించినందుకు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, ఉపాధ్యాయులు అశోక్, శేఖర్ పాల్గొన్నారు


చిన్న కిష్టాపూర్ పాఠశాలలో మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

జహీరాబాద్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో బీజేపీ అభ్యర్థి రాంచందర్ రాజనర్సింహకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, అరుణ కౌశాస్, అర్చనసారదా, అనిత స్వామి, శోభారాణి, సోమ అనిల్, నరేష్‌పాటిల్, ఉషారాణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంగ్టిలో..

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని తడ్కల్ గ్రామంలోని సంతలో బీజేపీ అభ్యర్థి జనవాడే సంగప్ప ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖేడ్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం దామరగిద్దా, బాన్సువాడ, ముర్కుంజాల్, రాసోల్ తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

'అభివృద్ధిలో రాష్ట్రం వెనకబడింది'

జిన్నారం(పటాన్‌చెరు): అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం వెనకబడిందని నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నందీశ్వర్‌గౌడ్ అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు నివాసం ఉండే బొల్లారం మున్సిపాలిటీలో కాలనీలు చెత్తాచెదారంతో నిండిపోయాయని తెలిపారు. తనకు అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశీర్వదించి అవకాశమివ్వండి

జిన్నారం(పటాన్‌చెరు): రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించి అవకాశమిస్తే నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని బీఎస్పీ అభ్యర్థి నీలం మధు అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలో మంగళవారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి తనకు మద్దతు లభిస్తోందన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలో అన్ని రాష్ట్రాల ప్రజలు నివాసం ఉంటున్నారన్నారు. ఇక్కడ నెలకొన్న ప్రతి సమస్య నా దృష్టిలో ఉందని తెలిపారు. తనను గెలిపిస్తే సంబంధిత ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆయా మండలాల బీఎస్పీ నాయకులు, యువకులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.